క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామంలో మిర్చి పంటలో అంతర పంటల వ్యవసాయం గురించి గురువారం ప్రకృతి వ్యవసాయ రైతులకు సిబ్బంది వివరించారు. మిర్చిపంటలో సూర్యమండల వ్యవసాయం చేసే విధానం, దానిలో ఆకుకూరల పెంపకం, ఎటువంటి రకాల ఆకుకూరలు వేసుకోవాలనే దానిపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, అన్నామణి పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టండి

ఎమ్మెల్సీ హనుమంతరావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సూచించారు. తాడేపల్లి ఎంటీఎంసీ కార్యాలయంలో తెనాలి రోడ్డు విస్తరణపై గురువారం ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్‌తో కలసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రహదారులు ఇరుకుగా ఉండడంతో ప్రజలు వాహనాలు పార్క్ చేసుకునే అవకాశం లేదని, అందుకే 60 అడుగులు రహదారిని విస్తరించాలని చెప్పారు. నష్టపోయే వారికి ఇవ్వనున్న టీడీఆర్ బాండ్లు, నష్ట పరిహారంపై అవగాహన కల్పించాలని కోరారు. త్వరలోనే రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

యర్రబాలెంలో ఓ ఇంట్లో చోరీ



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో చోరీపై మంగళగిరి రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ క్రాంతి తెలిపిన వివరాలు.. యర్రబాలెం శ్రీరామనగర్‌లో నివాసముంటున్న ఖాజావలీ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఖాజావలి తల్లిదండ్రులు మొహమ్మద్ రఫీఉల్లా బేగ్, తల్లి ముంతాజ్ బేగం అదే ప్రాంతంలోని మరో వీధిలో నివాసముంటున్నారు. ఇటీవల తండ్రి మృతి చెందడంతో ఆయన నివసిస్తున్న ఇంటికి తాళం వేసి తల్లిని తనతో తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఖాజావలి బేగ్ నివాస గృహంలో చొరబడి బీరువా తాళాలు పగలకొట్టి బీరువాలో దాచిన మూడు బంగారం ఉంగరాలు, వెండి చైన్, చెవిదిద్దులు, రెండు జతల వెండి పట్టీలు, ఐదు జతల వెండి మెట్టెలను దొంగిలించుకుపోయారు. ఈ ఘటనపై ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ క్రాంతి తెలిపారు.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలో నివాసముండే ఓ వ్యక్తి తన తండ్రి కనిపించడం లేదంటూ గురువారం మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు.. పట్టణ పరిధిలో మైలార్ నగర్‌లో నివాసముండే కందుల దుర్గారావు తన తండ్రి కందుల పిచ్చయ్య కొంత కాలం తన వద్ద, కొంతకాలం విజయవాడలో తన తమ్ముడు నాగరాజు వద్ద నివాసముంటున్నారని, కొద్ది రోజుల క్రితం తండ్రి పిచ్చియ్య, తమ్ముడు నాగరాజు, మైలార్ నగర్‌లోని తన నివాసానికి వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీపీ, షుగర్, బ్రెయిన్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడని, మంగళవారం తెల్లవారు జామున చూడగా, తన తండ్రి ఇంట్లో కనిపించ లేదని, చుట్టు పక్కల వారిని, బంధువులను విచారించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించ లేదని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు కాపు రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై సదస్సు



పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 30న ఉమ్మడి గుంటూరు జిల్లా కాపుల రాజకీయ భవిష్యత్తు కార్యాచరణపై చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు కాపు, తెలగ, బలిజ, జేఏసీ కన్వీనర్ దాసరి రాము, కాపు రాజకీయ చైతన్య వేదిక బి. శివరాం తెలిపారు. అరండల్‌పేటలోని ఓ హోటల్లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం కాపులకు టికెట్లు కేటాయించాలని కోరుతూ నిర్వహించనున్న ఈ సదస్సు ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సదస్సులో అన్ని నియోజకవర్గాలకు చెందిన కాపు సంఘీయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, పగడాల సీతారామయ్య, నారదాసు శ్రీహరి, కాపు నాయకులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలను గుర్తించడమే లక్ష్యం

ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి



ఆటలపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: మట్టిలో మాణిక్యాలను బయటకు తీస్తూ యువతీ యువకుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీలను ఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ మురుగుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా, ఇది అందరి ఆట అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారని, సుమారు 12 కోట్ల రూపాయల ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 5 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారని, ఈ ఆటల పోటీలలో రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, బూత్ కో ఆర్డినేటర్ మాలిక్, పార్టీ నాయకులు గుండాల మధు, శివారెడ్డి, ఒమ్మ సాంబిరెడ్డి, జింకా మహేష్, యర్రాకుల సురేష్ పాల్గొన్నారు.



చింతలపూడిలో పోటీలను ప్రారంభిస్తున్న దుగ్గిరాల ఎంపీపీ, జెడ్పీటీసీ

దుగ్గిరాలలో....

ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మూడో రోజు ఆటల పోటీలు దుగ్గిరాల మండలం వ్యాప్తంగా పోటాపోటీగా జరిగాయి. దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో పోటీలను ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీడీఓ వీరయ్య ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిభ ఉండి అవకాశంలోని క్రీడాకారులను గుర్తించేందుకు ఈ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ఆటల పోటీలను జయప్రదం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, నాయకులు జమ్ముల లోకేష్, ధర్మరత్నం పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

మేడికొండూరు: సామాజిక సాధికార బస్సు యాత్ర ఈనెల 31వ తేదీన నియోజకవర్గంలోని తాడికొండలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తెలిపారు. మండల పరిధిలోని పేరేచర్ల సాయికృష్ణ కల్యాణమండపంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ, పార్టీ మండల అధ్యక్షులు, పలువురు ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించి వారిని అవగాహన కల్పించి, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. విజయవంతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రణాళికా బద్ధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. తాడికొండ అడ్డరోడ్డు నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్ర బస్టాండ్ వరకు కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ధ్యేయం

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



టాస్‌వేసి పోటీలు ప్రారంభిస్తున్న జేసీ రాజకుమారి

ఫిరంగిపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను గురువారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను టాస్‌వేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1,43,039 మంది క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా కోసం పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వాటిలో 567 సచివాలయాలకు గాను ఐదు క్రీడలకు గాను 13వేల 174టీంలుగా ఏర్పాటు చేశామన్నారు. వారితో 229 గ్రౌండ్‌లలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి అవసరమైన 22వేల 453క్రీడాపరికరాలు , కిట్లు, మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ విలియమ్స్, సర్పంచి మేడాబాబు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్‌లో షేర్‌లు కొని మోసపోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటలో నివాసం ఉండే కె.వి.సత్యనారాయణ ఆన్‌లైన్‌లో తొలుత రూ. 10వేలు పెట్టుబడి షేర్ కొని లాభం పొందాడు. దీంతో సత్యనారాయణ ఐఆర్ఈఏడీ వెబ్‌సైట్‌లో విడతల వారీగా రూ.53 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మొత్తం రూ.1.25 కోట్ల లాభం వచ్చినట్లు చూపించింది. అయితే డబ్బు విత్‌డ్రా చేయబోతే రాలేదు. దీంతో సత్యనారాయణ వెబ్‌సైట్ నిర్వాహకుల్ని సంప్రదిస్తే ఎలాంటి సమాధానం లేదు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఆగంతకుడు మహిళ మెడలో బంగారు గొలుసు తెచుకుని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండరీపురం 6వ లైనులో నివసించే పి.పద్మావతి గురువారం నడుచుకుంటూ వెళుతోంది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ పెట్టుకుని ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

మహిళ ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డినగర్‌లో నివాసం ఉండే శివశంకర్ భార్య మరియకుమారి కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు అవగాహన



మేడికొండూరు: మండలంలోని సిరిపురం గ్రామంలో రైతు సాధికార సంస్థ సెర్ప్ యాజమాన్యం ఒప్పందంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పంటలపై మహిళ రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏపీఎం విజయభారతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన సాగు చేసిన పంటల ద్వారా మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. సభ్యులు అంతర పంటల సాగుపై రైతులకు ఆర్థికాభివృద్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో టీసీలు షేక్ కరీముల్లా, వి.మల్లేశ్వరరావు, కరుణమ్మ, ఎంఎస్ఓబీలు, వీఓఏలు, వరప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయంలో మండల పూజ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని రైల్వేగేటు సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఓం శ్రీ సిద్ధి విఘ్నేశ్వరస్వామి, మణికంఠ దేవస్థానం కమిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. కేరళ మెయిల్ శాంతి ప్రధాన అర్చకులు మధుసూదన నంబూద్రి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి అయ్యప్పస్వామి ఆలయ చైర్మన్ బండి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 3 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించినట్లు చెప్పారు. సాయంత్రం నగర సంకీర్తన, దీపారాధన, అత్తాళ పూజ, హరిహరాసనం, గ్రామోత్సవం నిర్వహించారు.

మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేటలో మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపిన వివరాలు.. నులకపేట గుంటూరు చానల్ ఒడ్డున ఓ పాకలో పాలబూత్ నిర్వహిస్తున్న దొంత పుల్లారావు పాల బూత్ ముసుగులో మద్యం అమ్ముతున్నాడని సీఐ మల్లికార్జునరావుకు రాబడిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. తనిఖీల్లో పుల్లారావు పాలబూత్‌లో ఎనిమిది క్వార్టర్ బాటిళ్లు లభించడంతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

మంగళగిరి చేరుకున్న వడ్డెర్ల పాదయాత్ర



తిరుపతి నుంచి మంగళగిరికి చేరుకున్న వడ్డెర సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: ఎస్టీ రిజర్వేషన్ సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న వడ్డెర మహాపాదయాత్ర గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణానికి గురువారం చేరింది. నాయకులు మాట్లాడుతూ నవంబర్ 22న తురక అమరనాథ్ ఆధ్వర్యంలో తిరుపతి అలిపిరి పాదాల వద్ద నుంచి ప్రారంభించి విజయవాడ కనకదుర్గమ్మ పాదాల వరకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. వడ్డెర్లు అన్ని విధాలుగా ఎస్టీ రిజర్వేషన్‌కు అర్హులని, అనేక కమిటీలు, కమిషన్లు, భారత ప్రభుత్వానికి నివేదికలు అందించాయని, ఆ నివేదికలు నేటికీ అమలుకు నోచుకోలేదని అన్నారు. గతంలో సత్యపాల్ కమిటీ కొన్ని జిల్లాల్లో పర్యటనలు జరిపి వడ్డెర కులస్తుల జీవిత స్థితిగతులపై అధ్యయనం చేసిందని గుర్తు చేశారు. నేటికీ వడ్డెర్లు కొంతమంది సంచార జీవితం గడుపుతూ నిరక్షరాస్యతతో, పేదరికంలో ఉన్నారనేది వాస్తవమని, ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో వడ్డెర్లు ఎస్సీలుగాను, నాలుగు రాష్ట్రాల్లో ఎస్టీలుగాను కొనసాగుతున్నారని, కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే బీసీ రిజర్వేషన్ జాబితాలో కొనసాగుతున్నారని అన్నారు. వడ్డెరను ఎస్టీ జాబితాలో చేర్పించాలని ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దేవల్ల రేవతి, వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర కార్యదర్శి కుంచాల కిషోర్, బీసీ సంఘం నాయకులు రమణ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



గ్రంథాలయాధికారులకు పుస్తకాలు అందజేస్తున్న జేసీ రాజకుమారి

తాడికొండ: తాడికొండ, పొన్నెకల్లు శాఖా గ్రంథాలయాలకు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పుస్తకాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి జి.రాజకుమారి అందజేశారు. ఆన్ డిమాండ్ పద్ధతిలో కొనుగోలు చేసిన ఈ పుస్తకాలను విద్యార్థులకు ఆయా గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకున్నట్లు గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు.

తాడేపల్లిరూరల్: మంగళగిరి శాఖా గ్రంథాలయానికి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి గురువారం గ్రూప్–2 పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీ లక్ష్మీతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళగిరి శాఖ గ్రంథాలయానికి గ్రూప్–2 పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందజేశామని, సన్నద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కేఎల్‌యూ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు



రసాయనిక మందులపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ వ్యవసాయ విభాగం విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ వడ్డేశ్వరం పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయం వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గురువారం నూతక్కిలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వ్యవసాయ విభాగం డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని అన్నారు. వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయాన్ని వ్యాపార రూపంగా రైతులు తమకు తాము ఒక ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసుకునే విధంగా తమ కళాశాల విద్యార్థులు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారని కోరారు. ఈ సందర్భంగా సదస్సు ప్రాంగణంలో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు రసాయనిక మందుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంగళగిరి అసిస్టెంట్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆక్టర్ జి. శ్రీనివాసరెడ్డి, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

మన సంప్రదాయాలను గౌరవించాలి

సీఐ మల్లికార్జునరావు



కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను అభినందిస్తున్న తాడేపల్లి సీఐ మల్లికార్జునరావు

తాడేపల్లిరూరల్: మన సంప్రదాయాలను గౌరవించాలని తాడేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి వంశీ హైస్కూల్‌లో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో విద్యార్థులు పాల్గొని కూచిపూడి నృత్యాన్ని నిర్వహించారు. పాఠశాల ఆధ్వర్యంలో ఆ విద్యార్థులకు అభినందన సభను నిర్వహించగా సీఐ మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ప్రాచీన కళలకు ఆదరణ తగ్గి, పాశ్చాత్య పోకడలతో కొంతమంది విద్యార్థులు, యువతీ యువకులు దారి తప్పుతున్నారని, ఇలాంటి సమయంలో సంప్రదాయ బద్ధంగా కూచిపూడి వంటి నృత్యాలపై దృష్టి సారించాలని కోరారు. తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించి ఇలాంటి నృత్యాలు నేర్పించడం ఎంతో సంతోషించదగ్గ విషయం అని అన్నారు. వంశీ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న పి.దుర్గా అనిష్క, ఎస్.జిత్య, బి.తేజశ్రీ రెడ్డి, వై.లహరి, ఎం.ఈక్షిత భవ్య హైదరాబాద్‌లో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు వారు నిర్వహించిన కూచిపూడి నృత్యంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వంశీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బెజ్జం ప్రసాద్, రాజారత్నం పాల్గొన్నారు.

వికసిత్ భారత్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వికసిత్ భారత్ – 2047 (వాయిస్ ఆఫ్ యూత్) క్యాంపెయిన్ పోస్టర్‌ను గురువారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్ విజయవంతం చేసి విద్యార్థులంతా తమ సూచనలు, సలహాలు ఇచ్చి దేశ వికాసానికి తోడ్పడాలని సూచించారు. వికసిత్ భారత్ వర్సిటీ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి. సిద్ధయ్య మాట్లాడుతూ విద్యార్థులంతా ఈ క్యాంపెయిన్‌లో రిజిస్టర్ అవ్వాలని కోరారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు కార్యక్రమంపై వీడియో, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ పాల్గొన్నారు.

అపూర్వ గ్రంథ సేకర్త లంకా సూర్యనారాయణ

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

పాత గుంటూరు: అమూల్యమైన గ్రంథాలను వేలాదిగా సేకరించిన అపూర్వ గ్రంథ సేకర్త లంకా సూర్యనారాయణ అని జీఎస్టీ సెంట్రల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి కొనియాడారు. బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రతి విభాగంలో పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాల ప్రాధాన్యం, ప్రాముఖ్యాన్ని వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ లంకా సూర్యనారాయణ సేకరించిన విజ్ఞాన భాండాగారమే అన్నమయ్య గ్రంథాలయమని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్ని భావితరాలకు పుస్తకాల ద్వారా వ్యాపింపజేయడం అభినందనీయమని చెప్పారు. ఇది తెలుగు భాషకి చేస్తున్న సేవ అని కొనియాడారు. పుస్తక ప్రపంచానికి సూర్యనారాయణ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్‌ను లంకా సూర్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో గుమ్మడి సీతారామయ్య, లంకా విజయ శారద, లైబ్రేరియన్ సుభాషిణి, కాకర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాల హుండీ కానుకల లెక్కింపు

పాత గుంటూరు: దేవదాయ శాఖ పరిధిలోని కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి, జగన్నాథస్వామి, లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో గురువారం హుండీలు లెక్కించగా రూ.8,17,511 ఆదాయం వచ్చిందని ఈవో కె.సూర్యప్రకాశరావు తెలిపారు. శ్రీ జగన్నాథస్వామి దేవస్థానానికి రూ.10 వేలు, ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ. 3,14,463, వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి రూ.4,93,042 వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తత అవసరం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా పక్షోత్సవాలను ఈనెల 27వ తేదీ నుంచి జనవరి 12 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టామని దుగ్గిరాల మండల పరిధిలోని 18 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతుందని అన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపలు, కనుబొమ్మలు మరియు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు దిప్పడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులుతిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, చేతి వేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం తదితర లక్షణాలు ఉన్న ఎడల వెంటనే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని వివరించామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఫిరంగిపురం: గ్రామీణ స్థాయిలో ఉన్నతమైన సమాజం కోసం, చిన్నారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు జేసీ రాజకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద జేసీ రాజకుమారికి అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.